సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 18 । జూలై । 2025



ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి
రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. 8లో▸



గీతా పారాయణం
ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని వికారాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో భగవద్గీత పారాయణం చేశారు. 8లో▸



వర్షాలు కురవక..
ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా సాగుకు సరిపడా వర్షాలు పడక రైతులు ఆందోళన చెందుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

తాండూరు ఏడీఏగా కొమురయ్య



తాండూరు రూరల్: తాండూరు ఏడీఏగా కొమురయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన రుద్రమూర్తి పదోన్నతిపై కుమురంభీం ఆసీఫాబాద్ జిల్లాకు డీడీఏగా వెళ్లారు. తాండూరు మండల ఏఓగా ఉన్న కొమురయ్యకు ఏడీఏగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ వారికి సాగుపై సూచనలు సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

మోమిన్‌పేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ వికారాబాద్ కోఆర్డినేటర్ వడ్ల నందు, మండల అధ్యక్షుడు అశిరెడ్డి, నాయకులు సాయి భుజంగ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రంగారెడ్డి, రమేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్: దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కొడంగల్ మండలంలో 509 కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. 3,005 మంది కొత్తగా రేషన్‌కార్డులో పేర్లు నమోదు చేసుకున్నారని వివరించారు. సమావేశంలో డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందాలి

జిల్లా వైద్యాధికారి లలితాదేవి



పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారి పరిస్థితిని తెలుసుకుంటున్న లలితాదేవి

తాండూరు టౌన్: ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితా దేవి సిబ్బందిని ఆదేశించారు. నూతనంగా జిల్లా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆమె తాండూరులో పర్యటించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆస్పత్రి, బస్తీ దవాఖాన, అర్బన్ హెల్త్ సెంటర్‌లను పరిశీలించారు. ఆయా ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తాండూరులోని ఆస్పత్రుల్లో ఉత్తమ వైద్య సేవలందిస్తున్నారన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కాన్పు కోసం ఎంసీహెచ్‌కు వస్తున్నారన్నారు. నెలవారీ ప్రసూతి కేసుల సంఖ్య మెరుగ్గా ఉందన్నారు. ఎంసీహెచ్‌లోని ఎన్‌ఆర్సీ, డైస్ సెంటర్లలో చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, కౌన్సెలింగ్ సేవలు భేషుగ్గా కొనసాగుతున్నాయన్నారు. డీఎంహెచ్‌ఓతో పాటు డిప్యూటీ డిఎంహెచ్‌ఓ రవీందర్ యాదవ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

20 జెడ్పీటీసీ | 227 ఎంపీటీసీ

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు ఖరారు



వికారాబాద్‌లోని జెడ్పీ కార్యాలయం

- 2019తో పోలిస్తే ఆరు పెరిగి 227కు చేరిన ఎంపీటీసీ స్థానాలు
- 18 నుంచి 20కి చేరిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు
- మొత్తం ఓటర్లు 6,99,894 మంది
- పోలింగ్ స్టేషన్లు 1,288
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు

వికారాబాద్: త్వరలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయనే సంకేతాలు వెలువడుతున్నాయి. తాజాగా ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఖరారు చేయడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. బుధవారం మండలాల వారీగా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల వివరాలను కూడా ప్రకటించింది. స్థానిక సంస్థల్లో ముందుగా గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం జీపీ ఎన్నికలకు బదులుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తయిన నేపథ్యంలో పార్టీ గుర్తుతో నిర్వహించే ఎన్నికలకే వెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ఎన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఉండాలనే దానిపై అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా దాన్ని ఆమోదించింది. కొత్తగా ఏర్పాటైన మండలాలు, పక్క మండలాల నుంచి కలిసిన గ్రామాలు, మండలాల నుంచి మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలను పరిగణలోకి తీసుకుని మండలాల వారీగా ఎంపీటీసీల సంఖ్యను నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటైన మండలాల్లో సైతం ఎంత మంది ఎంపీటీసీలు ఉండలానేది నిర్ణయించారు. ఒక్కో ఎంపీటీసీ పరిధిలో సగటున 3,083 మంది ఓటర్లు రాగా.. ఒక్కో జెడ్పీటీసీ పరిధిలో 34,997 మంది ఓటర్లు రానున్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

జిల్లాలో మొత్తం 221 ఎంపీటీసీ, జెడ్పీటీసీలు 18 స్థానాలు ఉన్నాయి. గత ఏడాది జూలైలో ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ఒక్కరోజు తేడాతో జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం పూర్తయ్యింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పాలన సాగుతోంది. గతంలో ప్రభుత్వం జీపీ ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించింది. ఓటరు జాబితా, బీసీ కమిషన్ నివేదికతో సన్నద్ధంగా ఉండాలని సూచించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ప్రభుత్వం దీన్ని పక్కన పెట్టి పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించింది. అతి త్వరలో వరుస ఎన్నికలు రావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పెరిగిన స్థానాలు

2019లో జరిగిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం వీటి సంఖ్య పెరిగింది. అప్పట్లో 18 మండల పరిషత్‌ల పరిధిలోని 221 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. కొత్తగా చౌడాపూర్, దుద్యాల్ మండలాలు ఏర్పాటైన నేపథ్యంలో వీటి పరిధిలో ఆరు కొత్త ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో వీటి సంఖ్య 227కు చేరింది. అత్యల్పంగా బంట్వారం మండలంలో 6 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మర్పల్లి, తాండూరు మండలాల్లో 15 చొప్పున ఉన్నాయి. జిల్లాలో 3,44,963 మంది పురుష ఓటర్లు ఉండగా, 3,54,912 మంది మహిళా ఓటర్లు, 19 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 20 మండలాల పరిధిలో 1,288 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయా లని నిర్ణయించారు. ఒక్కో బూత్ పరిధిలో 400 నుంచి 750 మంది ఓటర్ల వరకు ఉన్నారు.

మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాలు, ఓటర్ల సంఖ్య

మండలం	2019లో	2025లో	ఓటరు
బంట్వారం	06	06	17,690
బషీరాబాద్	12	12	41,178
బొంరాస్‌పేట్	15	11	32,086
చౌడాపూర్	00	09	25,176
ధారూరు	12	12	36,304
దోమ	14	14	44,359
దౌల్తాబాద్	15	14	41,758
దుద్యాల్	00	08	20,967
కొడంగల్	11	11	32,144
కోట్‌పల్లి	07	07	21,361
కుల్కచర్ల	16	12	38,413
మర్పల్లి	15	15	45,455
మోమిన్‌పేట్	12	12	39,788
నవాబుపేట్	12	12	37,917
పరిగి	13	11	31,202
పెద్దేముల్	13	13	40,820
పూడూరు	13	13	43,419
తాండూరు	15	15	47,107
వికారాబాద్	07	07	24,250
యాలాల	13	13	38,500



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఇంటికి వెలుగు ఇల్లాలే

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

అనంతగిరి: పేదలకు మంచి చేయాలంటే పదవులే కాదు మంచి మనసు కూడా ఉండాలని.. మీరందరూ ఈ విషయాన్ని గమనించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి సంబురాలతోపాటు కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీ(రూ.9.12 కోట్లు) చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే కుటుంబాలతో పాటు దేశం కూడా పురోగతి సాధిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ ఇల్లాలే వెలుగని పేర్కొన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా వారి పేరిట ఇస్తున్నట్లు గుర్తు చేశారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు, ఆర్టీసీకి అద్దె బస్సులు ఇప్పించడం, పెట్రోల్ బంకుల నిర్వాహణ, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్లుల ఏర్పాటు చేయిస్తున్నట్లు వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశంతో ఏటా రూ.20 వేల కోట్లు వడ్డీ లేకుండా ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మహిళా సంఘాలు డ్రోన్ల వ్యాపారం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. స్త్రీలు వ్యాపార వేత్తలుగా ఎదిగితోటి వారకి ఉపాధి కల్పించాలని సూచించారు. మహిళల ఆశీర్వాదం ఉంటే ప్రభుత్వం చల్లగా ఉంటుందన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, సాధారణంగా మరణిస్తే రూ.2 లక్షల బీమా అమలవుతుందని పేర్కొన్నారు.జిల్లాలో రూ.32.70 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు చేసినట్లు చెప్పారు. తద్వారా వికారాబాద్ నియోజకవర్గంలోని 30 వేల మందికి లబ్ధి చేకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, హెల్త్ డైరెక్టర్ జాన్సన్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీవో సభ్యుడు జాఫర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుదర్శన్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జానకి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అనంతగిరి గుట్టపై అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతగిరులను అన్ని విధాల అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం వికారాబాద్ పట్టణంలోని బ్లాక్ గ్రౌండ్‌లో ప్రాంగణం పునర్నిర్మాణం, బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- గడిసింగాపూర్ – రంగారెడ్డిపల్లి బీటీ రోడ్డు పనులు ప్రారంభం

దోమ: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం దోమ మండలం దాదాపూర్‌లో రూ.75 కోట్లతో గడిసింగాపూర్ – రంగారెడ్డిపల్లి బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేయడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. పరిగి, షాద్‌నగర్, వికారాబాద్ రోడ్లను నాలుగు లేన్లగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామానికీ బీటీ రోడ్లు వేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనసూయమ్మ, ఏఎంసీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, శాంతు కుమార్, బద్రీ, డీసీసీ ఉపాధ్యక్షులు రాములు నాయక్, బాల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, గ్రామ అధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రుణాలు

పూడూరు: ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పూడూరు మండలంలో పల్లె పల్లెకు అభివృద్ధి అనే కార్యక్రమం నిర్వహించారు. ఎన్కేపల్లి, గొంగుపల్లి, మన్నేగుడ, కొత్తపల్లి, మేడికొండ తదితర గ్రామాల్లో రూ.2.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎన్కేపల్లిలో చంద్రకళ, శిరీష నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, శ్రీనివాస్, పెంటయ్య, అజీం పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, నాయకులు నర్సింహారెడ్డి, అబ్బాస్, బాలమణి, వేణుగోపాల్, రాములు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ అభివృద్ధికి శ్రీకారం

భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ

- 8,736 గజాల స్థల సేకరణకు రంగం సిద్ధం
- నిర్వాసితులకు ఇంటి స్థలం, పరిహారం
- ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ విస్తరణ

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ ఉన్న ప్రైవేటు స్థలాన్ని సేకరించడానికి గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. 96 మంది నుంచి 8,736 గజాల స్థల సేకరణకు రంగం సిద్ధమైంది. ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి జాతర స్థలంలో ప్రత్యేక వెంచర్ వేసి ఇంటి స్థలంతో పాటు పరిహారం ఇవ్వనున్నారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఆలయాన్ని విస్తరించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం ముందుకు వచ్చింది. భూ సేకరణ తర్వాత టీటీడీ, తెలంగాణ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాన్ని విస్తరిస్తారు. అన్ని వసతులు, సౌకర్యాలతో అభివృద్ధి చేస్తారు. నూతన భవనాలు నిర్మిస్తారు. క్యూ లైన్, కల్యాణ మండపం, కల్యాణ కట్ట, పూజా మందిరాలు, వసతి గదులు, భక్తుల సౌకర్యార్థం స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వాటిని నిర్మిస్తారు. టీటీడీ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.



ఆలయ మహా ద్వారం

ఆలయ చరిత్ర

పట్టణానికి చెందిన దివంగత నందారం మిడిదొడ్డి నర్సింలు గుప్తా తిరుమల శ్రీవారికి అపార భక్తుడు. ఆయన ఒంట్లో శక్తి ఉన్నన్ని రోజులు తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకునే వారు. వయోభారంతో తిరుమలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. తిరుమలకు వెళ్లలేనేమోనని శ్రీవారిని వేడుకుంటాడు. అప్పుడు వేంకటేశ్వర స్వామి నర్సింలుకు కలలో కనిపించి కొడంగల్‌లో తనకు ఆలయాన్ని నిర్మించాలని కోరారు. ఈ విషయాన్ని నర్సింలు తిరుమలకు వెళ్లి అర్చకులకు తెలిపాడు. కొడంగల్‌లో ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరాడు. దీన్ని అర్చకులు తిరస్కరించారు. నిరాశతో నర్సింలు గుప్తా తిరుగు ప్రయాణమయ్యారు. కొన్ని రోజుల తర్వాత ఊహించని విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీమాన్ పెద్దింటి వెంకట రమణ దీక్షితులు, శ్రీమాన్ మాడంబాక్కం శ్రీనివాస భట్టాచార్యులు కొడంగల్‌కు వచ్చి శ్రీవారి ఆలయ నిర్మాణానికి సిద్ధం కావాలని నర్సింలు గుప్తాను కోరారు. తదనంతరం ఆలయ నిర్మాణం, స్వామివారి ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. నాటినుంచి నేటి వరకు ఏటా ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. తిరుమల నుంచి శేష వస్త్రం, పట్టు వస్త్రాలు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

నిత్య పూజలు

పట్టణంలో వెలిసిన శ్రీవారి ఆలయ మూలాలు తిరుమలలో ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. కలియుగ వైకుంఠ దైవం వేంకటేశ్వర స్వామి భక్తుల ఇలవేల్పుగా నిలిచారు. బ్రాహ్మణులు తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ శాస్త్ర సలహాదారులుగా ఉన్న సుందర వరద భట్టాచార్యుల ఆధ్వర్యంలో 50 ఏళ్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విరామంగా జరిగాయి. ఆయన తదనంతరం ఆయన పుత్రులు ఇక్కడ ఉత్సవాల నిర్వహణలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో నిత్యం వాహన సేవలు, కైంకర్యాలు, పూజలు, పవిత్రోత్సవాలు, ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి, దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి, ఆషాడ శుద్ధ ఏకాదశి, ప్రతి రోజు సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ తదితర వాటిని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

వసతులు కల్పించండి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు తాండూరు డిపో మేనేజర్ సురేష్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బస్టాండ్‌లో తాగునీటి సదుపాయం లేకపోవడం, మూత్రశాలల నిర్వహణ సరిగా లేకపోవడం, రాత్రి వేళలో విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఆటోలు, జీపుల నిలుపుదల కోసం బస్టాండ్ సమీపంలో ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలన్నారు. రానున్న శ్రావణమాసం సందర్భంగా పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రంలో కోరామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణాధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు సంగమేశ్వర్, కిరణ్, రాజు, శ్రీకాంత్, బబ్లూ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు విద్యాశాఖ సంచాలకులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నవీన్ నికోలస్

అనంతగిరి: కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించడానికి విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ నవీన్ నికోలస్ గురువారం వచ్చారు. వికారాబాద్ కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన్ను కలెక్టర్ ప్రతీక్ జైన్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఈఓ రేణుకాదేవి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సేవ చేయడం అదృష్టంగా భావించాలి

- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: ప్రజలకు సేవ చేయడంలోనే జీవితం సార్థకం అవుతుందని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ 37వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలన్నారు. కొడంగల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్టాలేషన్ అధికారిగా జిల్లా పూర్వ గవర్నర్ నటరాజ్, ఇన్‌స్టాలేషన్ కమిటీ చైర్మన్‌గా ముద్దప్ప దేశ్‌ముఖ్, ఇండక్షన్ అధికారిగా మృత్యుంజయ వ్యవహరించారు. కార్యక్రమంలో కొడంగల్ లయన్స్ క్లబ్ సభ్యులు దాసప్ప యాదవ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, శ్రీకిషన్ రావు, శివకుమార్ గుప్త, శివరాజ్ పాటిల్, మిఠాయి రాజు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మున్సిపల్ కార్మికులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు.

నూతన కమిటీ ప్రమాణస్వీకారం

లయన్స్ క్లబ్ కమిటీ పట్టణ నూతన అధ్యక్షుడిగా మురహరి వశిష్ట, కార్యదర్శిగా వడ్డె భీంరాజు, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

క్లుప్తంగా

మో'డల్' హౌస్!



ధారూరులో ముందుకు సాగని ఇందిరమ్మ నమూనా ఇల్లు

ధారూరు: మండల కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ హౌస్ బేస్మెట్ లెవల్ దాటడం లేదు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు మూడు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేయాలని చెబుతున్న అధికారులు నమూనా ఇంటిని మాత్రం అసంపూర్తిగా వదిలేశారని చెబుతున్నారు. మోడల్ హౌస్‌ను చూసి ఇళ్లు కట్టాలని చూస్తున్న తమకు ఏమీ తోచడం లేదని పేర్కొంటున్నారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న ఎస్‌ఐ తదితరులు

కుల్కచర్ల: ఆర్థిక వ్యవహారాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్ అన్నారు. ఇప్పాయిపల్లికి చెందిన ఎర్రం రాములు కుటుంబానికి మంజూరైన రూ.7.29 లక్షల చెక్కును గురువారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత బీమా, ప్రమాద బీమా వంటివి ఆపద సమయంలో ఆదుకుంటాయని, ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థల్లో పాలసీలు తీసుకుంటే భవిష్యత్తుపై ఆందోళన ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, శంకర్, సురేష్, నాయకులు బాల్‌రెడ్డి, రఘు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాటా ఆధ్వర్యంలో వైద్యసేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పూడూరు: మండల పరిధిలోని సాయి మందిరంలో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్(మాటా)ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రతి గురువారం సాయి మందిరం ట్రస్టీ చైర్మన్ డాక్టర్ ఏఎస్ నారాయణ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, అన్నదానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మాటా ప్రధాన కార్యదర్శి కలాల్ విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. మాటా ఫౌండర్ శ్రీనివాస్ గనగోని, సామల ప్రదీప్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లోరైడ్, వివిధ రుగ్మతలపై అవగాహన కల్పించామని చెప్పారు. శిబిరంలో పాల్గొన్న వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాలిక్‌రావు, బిందు రెడ్డి, పావని, హెమ్మిత, జగన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న జీడిగడ్డతండావాసులు

పరిగి: రాత్రి వేళల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జీడిగడ్డతండావాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ వెంకటేశ్వరికి ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి చింతల్‌చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్న చోటకు వెళ్లి నిలదీయగా తమనే బెదిరించారన్నారు. ఈ విషయమై 100కు డయల్ చేసి చెప్పగా మట్టి తవ్వకాల అంశం తమ పరిధిలోకి రాదని, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించడంతో గురువారం తండావాసులు పరిగికి చేరుకుని ఫిర్యాదు అందజేశారు.

నాపరాతి వ్యాపారికి సైబర్ షాక్

తాండూరు రూరల్: సైబర్ క్రైం వలలో ఓ నాపరాతి వ్యాపారి పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని అంతారం గ్రామ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్ యజమానికి జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. పెద్దేముల్ మండలం తట్టెపల్లికి చెందిన అరుణ్‌కుమార్ అంతారం గ్రామ శివారులో ఓ పాలిషింగ్ యూనిట్ నిర్వహిస్తున్నారు. తన పరిశ్రమ నుంచి నిత్యం లారీల్లో నాపరాతి బండలను వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో బండలను తరలించేందుకు లారీలు అవసరం కావడంతో ఆయన మహవీర్ ట్రాన్స్‌పోర్టుకు కాల్ చేశారు. బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి అరుణ్‌కుమార్‌కు కాల్ చేసి తక్కువ ధరకు లారీలు పంపిస్తున్నామని చెప్పారు. వాట్సాప్‌లో లారీ ఫొటో, ఆర్సీ పంపించి నమ్మించారు. అయితే ముందుగా డీజిల్‌కు రూ.17,500 పంపించాలని గుర్తు తెలియని వ్యక్తి అరుణ్‌ను కోరగా ఫోన్ పే చేశారు. ఎంతకి లారీలు రాకపోవడంతో పాటు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. తనను సైబర్ నేరగాళ్లు మోసం చేశారని పట్టణ పోలీసులకు గురువారం అరుణ్ ఫిర్యాదు చేశారు. ఆ

నిల్వ ఘనం.. వినియోగం దైన్యం!

- ఎరువుల వాడకంపై సందిగ్ధం
- వర్షాభావ పరిస్థితులతో వినియోగానికి అడ్డంకి
- దిగుబడి తగ్గుతుందని ఆందోళనలో రైతులు



తాండూరులో ఎరువుల లోటు దింపుతున్న కార్మికులు

తాండూరు: వానాకాలం సాగు ఈసారి రైతులకు కలిసి రావడం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్ని సమృద్ధిగా ఉన్నా సరిపడా వానలు మాత్రం కురవడం లేదు. పక్షం రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. భూమిలో తేమ లేని సమయంలో పంట పొలాలకు ఎరువులను వేయడంతో నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో 5.63 లక్షల ఎకరాలలో కంది, పత్తి, వరి, సోయా, పెసర, మినుములతో పాటు తదితర పంటలు సాగవుతున్నాయి. అయితే ఇప్పటికే 70 శాతం వరకు కర్షకులు తమ భూముల్లో పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ పంటలు కలుపు దశకు వచ్చాయి. అయితే పంట మొక్కల్లో సత్తువ కోసం డీఏపీ, యూరియా, పొటాష్ లాంటి ఎరువులను పైపాటుగా రైతులు పట్టిస్తారు. ఇప్పటికే పెద్ద ఎత్తున వాటిని కొనుగోలు చేసుకొని పంటలకు సైతం వేశారు. అయితే భూమిలో తేమ లేకుండా ఎరువులను వాడితే పంటలకు నష్టం సంభవిస్తోందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ దశలో వర్షం కోసం ఆకాశం వైపు దిగాలుగా చూడసాగారు.

12 మండలాల్లో వర్షాభావం

జిల్లాలో 12 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని వ్యవసాయాధికారులు ధ్రువీకరించారు. జిల్లాలోని పరిగి, బొంరాస్‌పేట, ధారూరు, కోట్‌పల్లి, యాలాల, దౌల్తాబాద్, చౌడాపూర్, దుద్యాల మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మిగతా 12 మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది. దీంతో మరో వారం రోజుల పాటు వర్షాలు కురవకపోతే రెడ్ జోన్ పరిధిలో వర్షపాతం నమోదవుతోందని వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

సకాలంలో రైతులకు ఎరువులను అందించేందుకు ప్రభుత్వం హోల్‌సేల్, రిటైల్, సొసైటీలు, మార్క్‌ఫెడ్ సంస్థలకు ఎరువుల పంపిణీకి అనుమతులు ఇచ్చింది. దీంతో ఇప్పటికే వేల మెట్రిక్ టన్నులను రైతులకు సరఫరా చేశారు. తాజాగా మార్కెట్‌లో యూరియా 6,942.331 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1,829 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 131 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 189 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకేఎస్ 4,372.360 మెట్రిక్ టన్నులు చొప్పున అందుబాటులో ఉన్నాయి.

వర్షాలు కురవాలి



రైతులు పండిస్తున్న పంటలకు డీఏపీ, యూరియా లాంటి ఎరువులను జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. అయితే పక్షం రోజులుగా వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు కురవడం లేదు. తేలికపాటి నేలల్లో తేమ లేకపోతే ఎరువులను వాడితే అనర్థాలు సంభవిస్తాయి. వర్షాలు లేని సమయంలో పైపాటు ఎరువులను పంటలకు పట్టించడంతో నష్టం జరుగుతోంది.

– రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



రైతు ఫొటో తీస్తున్న ఏఈఓ వైశాలి

- రైతులు విశిష్ట ప్రయోజనాలు పొందాలి
- వ్యవసాయ అధికారుల సూచన

దౌల్తాబాద్: రైతు సంక్షేమానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కూడా వివిధ పథకాలను అమలు చేస్తుంది. పీఎం కిసాన్, పంటల బీమా తదితర పథకాలను ఇందుకు ఉదహరణగా చెప్పవచ్చు. ఈ పథకాలను సవ్యంగా రైతులకు చేరేలా కేంద్రం ఆధార్ కార్డు మాదిరిగా 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులను అందజేయనుంది. ఈ ప్రక్రియ మే నెలలోనే ప్రారంభమై ఇంకా కొనసాగుతుంది. మండలంలో ప్రధానంగా ఈ ప్రక్రియను మండల వ్యవసాయ విస్తరణ అధికారులు నిర్వహిస్తున్నారు. అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ విశిష్ట సంఖ్యను కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు అనుసంధానం చేస్తూ దీన్నే ప్రామాణికంగా తీసుకోనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వ్యవసాయ పథకాలకు ఈ విశిష్ట సంఖ్యకు సంబంధం లేదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో 19,241 మంది పట్టాదారులు ఉండగా ఇప్పటివరకు 5,883 మంది రైతుల గుర్తింపు కార్డులను నమోదు చేశారు. ఇంకా 70శాతం మంది రైతులు మిగిలి ఉన్నట్లు ఏఓ లావణ్య తెలిపారు.

సాంకేతిక సమస్యలు

మండలంలో విశిష్ట కార్డుల ప్రక్రియ గురించి మండలంలో 9 క్లస్టర్లలో వ్యవసాయ అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ అన్నదాతలు ఆసక్తి చూపడంలేదు. ఈ ప్రక్రియ నిర్వహణలో కొన్నిసార్లు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ కార్డుల వల్ల ప్రయోజనాలను రైతులు గుర్తించి ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇచ్చి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. గురువారం దౌల్తాబాద్‌లో ఏఈఓ వైశాలి ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ చేపట్టారు. అన్నదాతలకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నమోదు ప్రక్రియ నిర్వహించారు.

సీటు కోసం వేసిన పర్సు, ఫోన్ మాయం!

తాండూరు టౌన్: ఆర్టీసీ బస్సులో సీటు ఆపుకొనేందుకు వేసిన పర్సు, సెల్‌ఫోన్ పోయాయంటూ ఓ మహిళ ఆందోళన వ్యక్తంచేసింది. తన వస్తువులు ఇచ్చే వరకూ బస్సును కదలనిచ్చేది లేదంటూ అడ్డుగా నిలబడింది. ఈ ఘటన తాండూరులో గురువారం చోటుచేసుకుంది. బషీరాబాద్ మండలానికి చెందిన ఓ మహిళ తాండూరు బస్టాండుకు వచ్చి ఓగిపూర్ వెళ్లే బస్సులో సీటు కోసం కిటికీలో నుంచి తన పర్సు, సెల్‌ఫోన్ వేసింది. లోపలికి వెళ్లి చూసే సరికి అవి కనపడలేదు. దీంతో ప్రయాణికులు ఎవరో తీసి ఉంటారని, వెంటనే ఇచ్చేయాలని కోరింది. ఎవరూ స్పందించకపోవడంతో ఇందిరాచౌక్‌లో బస్సుకు అడ్డంగా నిలబడింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, ప్రయాణికులను విచారించినా తామెవరమూ తీయలేదని చెప్పారు. దీంతో బాధిత మహిళకు నచ్చజెప్పిన పోలీసులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇవ్వమని సూచించారు.



ఇందిరాచౌక్‌లో బస్సుకు అడ్డుగా నిలుచున్న బాధిత మహిళ

సభ్యులంతా ఐకమత్యంతో ఉండాలి



నూతన కమిటీతో జిల్లా కార్యవర్గం సభ్యులు

కొడంగల్ రూరల్: సభ్యులంతా ఐకమత్యంతో ఉండి సంఘటితంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని రాజ్‌పుత్ సంఘం జిల్లా అధ్యక్షురాలు అనితాబాయ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో రాజ్‌పుత్ మహిళా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మహిళలు అభివృద్ధి సాధించేందుకు అనితాబాయ్ చర్చలు నిర్వహిస్తూ పలు తీర్మానాలు చేసుకున్నారు. అనంతరం రాజ్‌పుత్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సంఘం అధ్యక్షురాలుగా మోతీబాయి, ప్రధాన కార్యదర్శిగా జానకీబాయ్, సహాయ కార్యదర్శులుగా యశోదబాయ్, సక్కుబాయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు శ్యామల, గోరీబాయ్, సురేఖబాయ్ తదితరులు పాల్గొన్నారు.

వరుణ దేవా కరుణించ రావా

దుద్యాల్: సుమారు 45 రోజులుగా వరుణుడి జాడ లేకపోడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వాన కోసం ఎదురు చూస్తున్నారు. కంది, పెసర, మొక్కజొన్న, పత్తి వంటి ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బోరు బావులు ఉన్నవారు పంటలను రక్షించుకునేందుకు అతికష్టం మీద నీటి తడులు అందించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.



అల్లిఖాన్‌పల్లిలో స్ప్రింక్లర్ల సాయంతో పెసర పంటకు నీటి తడి

సామూహిక గీతా పారాయణం



ఆలయంలో గీతా పారాయణం చేస్తున్న మహిళలు

అనంతగిరి: గీతావాహిని ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా వికారాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఆషాఢ మాస భగవద్గీత పారాయణం నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని మారుతీనగర్ కాలనీలోని వైభవలక్ష్మి దేవాలయంలో గురువారం చేశారు. ఈ సందర్భంగా గీతావాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు తొడిగళ శ్రీదేవి సదానందరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి భగవద్గీతను చేర్చాలనే దృఢ సంకల్పంతో సనాతన ధర్మ పరిరక్షణకై ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎనిమిదేళ్ల నుంచి వికారాబాద్ ప్రాంతంలోని పలు దేవాలయాలలో భగవద్గీత తరగతులను నిర్వహించి సుమారు వెయ్యి మంది మహిళలకు, 600 మంది విద్యార్థులకు భగవద్గీతను నేర్పించామని చెప్పారు. భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంజుల రమేశ్‌కుమార్, మాజీ ఎంపీపీ చంద్రకళ, గీతా వాహిని ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు ఝాన్సీలక్ష్మి, విజయ, నీరజ, మాధురి, సునీత, వరలక్ష్మి, స్వాతి, జోత్స్న, సరళ, కరుణ, సుధా, నాగరాణి, సంజీవరాణి, ఆలయ నిర్వాహకులు స్వరూప రమేష్, అర్చకులు విక్రమ్ పాల్గొన్నారు .

పేదల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని గొల్లగూడలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్‌నాయక్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నాగిరెడ్డి, ఎక్‌బాల్, యాదిరెడ్డి, ఖదీర్ తదిరతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



గిర్యానాయక్ (ఫైల్)

పూడూరు: వ్యక్తి అదృశ్యమైన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రాత్లావత్ గిర్యానాయక్(56) ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫోర్జరీ చేసి.. ఆస్తులు కాజేసి

తప్పుడు వీలునామా పత్రాలు సృష్టించిన కేసులో దంపతుల అరెస్టు

చేవెళ్ల: రూ.కోట్లు విలువ చేసే భూమికి తప్పుడు వీలునామా పత్రాలు సృష్టించి కాజేసిన వ్యవహారంలో దంపతులు అరెస్టయిన సంఘటన మండల పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం భార్యాభర్తలను రిమాండ్‌కు తరలించగా మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన రెవెన్యూలో మత్తేగారి ప్రతాప్‌రెడ్డికి వివిధ సర్వే నంబర్లలో 125 ఎకరాల భూమి ఉంది. ఆయనకు సంతానం లేకపోవడంతో భార్య అనసూయ పేరుపై కొన్ని ఆస్తులున్నాయి. ప్రతాప్‌రెడ్డి తల్లి తరపు బంధువులైన జగన్‌మోహన్‌రెడ్డితో సన్నిహితంగా ఉండేవారు. పిల్లలు లేని కారణంగా దత్తత తీసుకున్నట్లు నమ్మబలికి కొంత భూమిని జగన్‌మోహన్‌రెడ్డిపై బదలాయించుకున్నారు. ఆ తరువాత తలెత్తిన వివాదాలతో 2017లో ప్రతాప్‌రెడ్డి అక్రమంగా భూమిని బదలాయించుకున్నాడని జగన్‌మోహన్‌రెడ్డిపై కోర్టులో కేసు వేశారు. ఈ క్రమంలో 2018లో ప్రతాప్‌రెడ్డి చనిపోవటంతో ఉన్న ఆస్తినంతా జగన్‌మోహన్‌రెడ్డి తన భార్య సురేఖలకే చెందుతుందని ఫోర్జరీ డాక్యుమెంట్ తయారు చేసి కాజేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రతాప్‌రెడ్డి దాయాదులైన రామేశ్వర్‌రెడ్డి అతని సోదరులు 2023లో కోర్టుకెక్కారు. ప్రతాప్‌రెడ్డికి సంతానం లేదని ఆయనకు దాయాదులైన మేమే అసలు వారసులమని జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు, సోదరులు అంతా కలిసి అక్రమంగా వీలునామాను సృష్టించి ఆస్తిని కాజేశారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలతో పోలీసులు విచారణ చేసి వీల్‌డీడ్‌ను ఎఫ్ఎస్ఎల్‌కి పంపించటంతో వీల్ డీడ్‌లో చేసిన ప్రతాప్‌రెడ్డి సంతకం ఫోర్జరీ చేసినట్లుగా నిర్ధారించారు. ఈ వ్యవహారంలో 10 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి అతని భార్య సురేఖను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ఆరుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన చేపల వేట

- కుంటలో మునిగి వ్యక్తి మృతి
- ఉట్లపల్లిలో విషాదం



అంజయ్య (ఫైల్)

కడ్తాల్: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతిచెందిన ఘటన మండల కేంద్రం సమీపంలోని కానుగుల కుంటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కందుకూరు మండలం ఉట్లపల్లికి చెందిన దొంతుల అంజయ్య(45) మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన రాజు, కృష్ణయ్య, శ్రీనుతో కలిసి, చేపలు పట్టేందుకు కానుగుల కుంటకు వెళ్లారు. ఈ క్రమంలో చెరువులోకి దిగిన అంజయ్య ప్రమాదవశాత్తు నీట మునిగి, బయటికి రాలేకపోయాడు. మిగిలిన వాళ్లు వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితులతో పాటు కడ్తాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, బుధవారం అర్ధరాత్రి వరకు చెరువులో గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం స్థానిక ఎస్‌ఐ వరప్రసాద్, పోలీసు సిబ్బంది, మహేశ్వరానికి చెందిన ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లు కుంటలో గాలించి ఊబిలో కూరుకుపోయిన మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శామంతతో పాటు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. అంజయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, బాధితులు

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆందోళన

తాండూరు టౌన్: దళితులపై దౌర్జన్యం చేస్తున్న మాజీ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు గురువారం తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జుంటుపల్లికి చెందిన దళితులు తాను చెప్పినట్లు నడుచుకోవడం లేదంటూ కక్షగట్టిన ఆయన అనుచరులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దళితులను కులం పేరుతో దూషిస్తూ, చంపుతానని భయపెడుతున్నాడని మండిపడ్డారు. వెంటనే అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున నిరసన చేస్తామని స్పష్టంచేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు నెత్తి పకీరప్ప, నర్సిములు, అంజిలప్ప, చిన్న హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు పోరాటం స్ఫూర్తిదాయకం



సంస్మరణ సభలో మృతవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్

తాండూరు టౌన్: కారంచేడు దళితుల పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని కుల నిర్మూలన పోరాట సమితి(కేఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్ అన్నారు. గురువారం కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో తాండూరులో కారంచేడు మృతవీరుల సంస్మరణ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1985 జూలైలో ఉమ్మడి ఏపీలోని ప్రకాశం జిల్లాలో తాగునీటిని కలుషితం చేసిన విషయమై ప్రశ్నించిన కారంచేడు గ్రామానికి చెందిన పలువురు దళితులను అనాగరికంగా నరికి చంపారన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు అనే భేదం లేకుండా కత్తులతో నరికి తీవ్ర గాయాల పాలు చేశారన్నారు. దీంతో అట్టుడికిన దళితులు నిందితులకు కఠిన శిక్ష విధించాలంటూ ఏళ్ల తరబడిగా పోరాటం చేశారన్నారు. వారి పోరాట ఫలితంగా ఎట్టకేలకు సుప్రీంకోర్టు నిందితులకు శిక్ష విధించిందన్నారు. కారంచేడులో దళితులపై జరిగిన నరమేధానికి వ్యతిరేకంగా చేసిన పోరాట ఫలితంగా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం రూపుదాల్చుకుందన్నారు. నాటి నుంచి దళితులు అగ్రకులాల పెత్తందారితనాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభినవ్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమాల్ అతర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరు



సభ్యత్వ నమోదులో పీఆర్‌టీయూ నాయకులు

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్

పరిగి: విద్యా, ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని పలు పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోస్టింగ్‌లో సర్దుబాటు, పెండింగ్ బిల్లులు, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర, జిల్లా శాఖకు తెలిపామన్నారు. పీఆర్‌టీయూ 52 ఏళ్లుగా అనేక సమస్యలపై పోరాటం చేస్తూ సమస్యలను పరిష్కరించుకుందన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల అయ్యేలా కృషి చేస్తామన్నారు. ఎవరికి ఏ సమస్యలు ఉన్న సంఘం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బుగ్గయ్య, గౌరవ అధ్యక్షుడు ఉస్మాన్‌అలీ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, గోపాల్, శంకర్, సుభాష్, నాయకులు రామాంజనేయులు, వెంకటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం.. ఆటోల చోరీ



రాజేంద్రప్రసాద్, నిందితుడు

శంకర్‌పల్లి: జల్సాలకు అలవాటు పడిన ఓ యువకుడు డబ్బుల కోసం ఆటోల చోరీకి పాల్పడి కటకటాల పాలయ్యాడు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్‌కి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ఆటో ఈనెల 14న కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. గురువారం చేవెళ్ల మండల ఎన్కేపల్లి వద్ద తనిఖీలు చేస్తుండగా.. పోలీసులను చూసి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడికి అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు నవాబుపేట మండలం కద్చర్ల గ్రామానికి చెందిన దుర్గంచెరువు రాజేంద్రప్రసాద్(25)గా గుర్తించారు. ఈ నిందితుడిపై గతంలో వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట్, సదాశివపేట, పరిగి తదితర పోలీస్‌స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయి. నిందితుడు పది రోజుల క్రితమే జైలు నుంచి విడుదలై, మళ్లీ ఆటో దొంగతనం చేసి దొరకడం గమనార్హం.